

అమ్మపాలు.... అమృతం

తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానం. అన్నిరకాల పోషకాలు తల్లిపాలలో ఉన్నా యి. రోగాల బారినుంచి బిడ్డను రక్షిస్తాయి.

8లో▸

ముగిసిన ఉపాధ్యాయ శిక్షణ

మంచిర్యాలఅర్బన్: వసతులు, సమ్మిళిత విద్యా బోధన అభ్యసన మధింపునకు శాలసిద్ధిపై జిల్లా కేంద్రంలో ఉపాధ్యాయులకు ఇస్తున్న శిక్షణ మంగళవారం ముగిసింది. పైలెట్ ప్రాజెక్ట్ కింద 31 బడులను ఎంపిక చేసి 73 మంది టీచర్లకు శిక్షణ ఇచ్చారు. రిసోర్స్ ప ర్సన్లు చౌదరి, శ్రీనివాస్, హేమలత, సత్య నారాయణమూర్తి, ఆర్పీలు రాజ్‌కుమార్, సాంబమూర్తి, అర్చన, మల్లేశ్ పాల్గొన్నారు.

గరిష్టం/కనిష్టం
36.0 /26.0

వాతావరణం

ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. పలుచోట్ల వర్షం పడే అవకాశముంది.

న్యూస్‌రీల్

గూడెంలో పౌర్ణమి జాతర



వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

దండేపల్లి: మండలంలోని గూడెం సత్య నారాయణస్వామి ఆలయంలో మంగళవా రం అధిక శ్రావణపౌర్ణమి జాతరను ఘనంగా నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో హాజ రయ్యారు. సత్యదేవున్ని దర్శించుకుని మొ క్కులు చెల్లించుకున్నారు. సుమారు వంద జంటలు సామూహిక సత్యనారాయణ వ్రతా లు ఆచరించాయి. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు.

కొనసాగుతున్న నీటి విడుదల



జలకళతో ఎల్లంపల్లి ప్రాజెక్ట్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఎగువ ప్రాం తాల నుంచి వస్తున్న వరద నీటితో ఎల్లంపల్లి ఇంకా జలకళతో ఉంది. సోమవారం 10 గేట్లు ఎత్తగా మంగళవారం ఏడు గేట్లను ఎత్తి గోదావరిలోకి నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్ట్ నీటి మట్టం 148 మీటర్ల క్రస్ట్ లెవె ల్‌కు గాను 146.96 మీటర్లు ఉండగా మొత్తం 20.175 టీఎంసీలకు గాను 17.271 టీఎం సీల నీటి సామర్థ్యంతో ఉంది. శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి 8వేలు, కడెం ప్రాజెక్ట్ నుంచి 3,100, ఎగువ ప్రాంతాల నుంచి 32 వేల క్యూసెక్కుల నీరు ప్రాజెక్ట్‌లోకి వచ్చి చేరుతోం ది. హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ పథ కానికి 325 క్యూసెక్కులు తరలిస్తుండగా, ఏడు గేట్లు ఎత్తి 37 వేల క్యూసెక్కులను గోదావరిలోకి వదులుతున్నారు.

కండ్ల కలకపై ప్రజలకు అవగాహన కల్పించాలి

మంచిర్యాలటౌన్: కండ్ల కలకపై జిల్లా ప్రజల కు అవగాహన కల్పించాలని జిల్లా వైద్యాధికా రి సుబ్బరాయుడు సూచించారు. జిల్లా వైద్యా రోగ్యశాఖ కార్యాలయంలో మంగళవారం అన్ని పీహెచ్‌సీల వైద్యాధికారులు, సిబ్బందికి కండ్ల కలకపై సమీక్ష నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే చికిత్స అందించేలా చర్యలు తీసుకోవాలని, ప్రభావిత గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహించాలని సూచించారు. ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ నీరజ, డాక్టర్ అనిత, డిప్యూటీ డీఎంహెచ్‌వో విజయపూ ర్ణిమ, డాక్టర్ విజయనిర్మల, డీపీవో ప్రశాంతి, డెమో వెంకటేశ్వర్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మంచిర్యాలటౌన్: జిల్లాలోని తెలంగాణ మై నారిటీ గురుకుల పాఠశాల, కళాశాలల్లో టీ చింగ్, నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తు లు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి నీరటి రాజేశ్వరి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. బెల్లంపల్లిలోని మైనారిటీ గురుకుల పాఠశాల (బాలికల)లో సెక్యూరిటీ గార్డు (మహిళ), చెన్నూరులోని మైనారిటీ గురుకుల పాఠశాల (బాలుర)లో సెక్యూరిటీ గార్డు (పురుష/మహిళ), పీజీటీ (బయోసైన్స్) (పురుష/మహిళ), టీజీటీ (ఇంగ్లిష్) (పురుష/మహిళ) పోస్టులను భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. సరైన ధ్రువీకరణ పత్రాలు జతచేసిన దరఖాస్తు లను ఈ నెల 7వ తేదీ సాయంత్రం 5గం టల్లోపు కార్యాలయ పనివేళల్లో జిల్లాలోని బెల్లంపల్లి (బాలికలు), చెన్నూరు (బాలురు) లేదా జిల్లా మైనారిటీ సంక్షేమశాఖ కార్యాల యంలో అందించాలని ఆమె సూచించారు.

గుణాత్మక విద్య అందించాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: గుణాత్మక విద్య అం దించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బీ రాహుల్ సూచించారు. మంగళవారం న స్పూర్‌లోని కలెక్టరేట్‌లో విద్యాశాఖ అధికారు లతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లా డుతూ.. పాఠశాలల్లో కిచెన్ గార్డెన్లు, అనుకూ లమైన పరిస్థితులు 50లోపు సంఖ్య ఉన్న ప్రాథమిక పాఠశాలల్లో గోబర్ గ్యాస్‌ప్లాంట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచిం చారు. ఒకటి నుంచి ఐదో తరగతి చదువు తున్న విద్యార్థులకు రాయడం, చదవడం లాంటి నైపుణ్యాలు తప్పనిసరిగా ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. 10వ తరగతి వార్షిక పరీక్షా ఫలితాల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధిం చడానికి అనువైన ప్రణాళికలు చేపట్టాలని పేర్కొన్నారు. వినూత్న కార్యక్రమాలు నిర్వ హించి విద్యార్థుల్లో వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం, మొదలైన నైపుణ్యాలు మెరుగు పడేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. డీఈవో యాదయ్య, సమగ్ర శిక్ష మంచిర్యాల కో ఆర్డినేటర్లు చౌదరి, శ్రీనివాస్. సత్య నారాయణమూర్తి, కోటపల్లి ఎంఈవో తిరుప తిరెడ్డి, హెచ్‌ఎంలు రాజగోపాల్, రఘు బాబు, ఆర్పీలు ఖాదర్, అర్చన పాల్గొన్నారు.

ప్రభుత్వంలోకి ఆర్టీసీ..

- విలీనానికి మంత్రివర్గ నిర్ణయం
- జిల్లాలో 521 మందికి మేలు
- నెరవేరనున్న దశాబ్దాల కల
- సంబురాల్లో సంస్థ ఉద్యోగులు



మంచిర్యాలలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే దివాకర్‌రావు, ఉద్యోగులు

మంచిర్యాలఅర్బన్: ప్రభుత్వంలో టీఎస్ ఆర్టీసీని విలీనం చేయాలని సోమవారం సీఎం కేసీఆర్ అధ్య క్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో మంత్రివర్గం కీలక నిర్ణయం తీసుకుంది. రానున్న శాసనసభ సమావేశాల్లో బిల్లు ప్రవేశపెట్టేందుకు సన్నద్ధమవు తోంది. తాజా నిర్ణయంతో ఆర్టీసీ ఉద్యోగులు ప్రభుత్వ ఉద్యోగులుగా మారనున్నారు. ఇక నుంచి ప్రభుత్వమే జీతభత్యాలు చెల్లించనుంది. ఇందుకు సంబంధించిన విధివిధానాల రూపకల్పనకు కమిటీ వేయనుంది. ఇదివరకు ఆర్టీసీ ఉద్యోగులకు జీతం ఎప్పుడు వస్తుందో.. తెలియని పరిస్థితి. శాసనసభ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వ నిర్ణయం అమల్లోకి వస్తుందా? తాత్సారం జరుగు తుందా? అనేది వేచి చూడాలి. ఏదేమైనా ప్రభుత్వ నిర్ణయంతో ఆ సంస్థ ఉద్యోగుల నుంచి హర్షాతిరే కాలు వ్యక్తమవుతున్నాయి.

521 మందికి ప్రయోజనం

ఉద్యోగత భద్రత కల్పించాలని, సంస్థను ప్రభు త్వంలో విలీనం చేయాలని గతంలో ఉద్యోగు లు సమ్మెబాట పట్టినా ప్రభుత్వం పరిగణన లోకి తీసుకోలేదు. ప్రస్తుతం ఆర్టీసీని విలీనం చేయాలని నిర్ణయించడంతో వారికి ఎంతో మేలు జరగనుంది. మంచిర్యాల డిపోలో 521 మంది విధులు నిర్వహిస్తున్నారు. ఇందులో 231 మంది కండక్టర్లు, 180 మంది డ్రైవర్లు, 75మంది గ్యారేజీ కార్మికులు, 29 మంది కార్యా లయ ఉద్యోగులు, సూపర్‌వైజర్లు విధులు ఉన్నారు. వీరంతా ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపు పొందనున్నారు.

రీజియన్ పరిధిలో

డిపో	డ్రైవర్లు	కండక్టర్లు	ఇతర ఉద్యోగులు
ఆదిలాబాద్	157	203	29
ఆసిఫాబాద్	118	115	19
భైంసా	63	146	19
నిర్మల్	171	217	18
ఉట్నూర్	34	52	13


52 రోజులు సమ్మె చేసినా..

ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయా లని, ఉద్యోగ భద్రత కల్పించాలని, తదితర డిమాం డ్లతో 2019లో ఆర్టీసీ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో 52రోజులు ఉద్యోగులు సమ్మె చేశారు. అంతకుముం దు దశలవారీగా ఆందోళనలు చేపట్టి ప్రయోజనం లేకపోవడంతో సమ్మెకు పూనుకున్నారు. స్పందిం చని ప్రభుత్వం ప్రత్యామ్నాయంగా తాత్కాలిక డ్రైవర్లు, కండక్టర్లతో బస్సులను నడిపించింది. అయి నా ఉద్యోగులు శాంతియుతంగా ఉద్యమాన్ని కొన సాగించారు. ఒక దశలో ఆర్టీసీ ఉద్యోగులను ప్రభు త్వం తొలగించేంతపని చేసింది. తప్పనిసరి పరిస్థి తుల్లో ఉద్యోగులు సమ్మె విరమించి విధులకు హాజర య్యారు. ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి సంఘాలకు స్వస్తి పలికి వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేసింది. డీఎంతో పాటు ఇద్దరు ఉద్యోగులను నియ మించింది. వీరు వారంలో ఒకరోజు ఫిర్యాదు బాక్స్ లో వచ్చిన సమస్యలు పరిష్కరిస్తూ.. డిపో స్థాయిలో లేని వాటిని ఉన్నతాధికారులకు నివేదించారు. సమ్మె తో పాటు కరోనా వ్యాప్తి చెందడం ఆర్టీసీ సంస్థపై తీవ్రప్రభావం చూపింది. అప్పటినుంచి యాజమా న్యం అందివచ్చిన అవకాశం సద్వినియోగం చేసు కుంది. 2020 జూన్19న కార్గో సేవలు ప్రారంభిం చింది. రాఖీల పంపిణీ, రాములోరి తలంబ్రాలు, పార్సిల్, కొరియర్స్‌తో ఆదాయం సమకూర్చుకుం టోంది. అకస్మాత్తుగా ఎవరూ అడగకుండానే నాలుగేళ్ల తర్వాత ఎట్టకేలకు ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసేందుకు మంత్రివర్గం నిర్ణయించింది.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసేందుకు మం త్రివర్గం నిర్ణయించడంతో మంగళవారం మం చిర్యాల డిపోలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి ఉద్యోగులు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమా నికి ఎమ్మెల్యే దివాకర్‌రావు హాజరయ్యారు. అసిస్టెంట్ డిపో మేనేజర్ దేవపాల, విజిలెన్స్, సెక్యూరిటీ హెడ్ కానిస్టేబుల్ సురేందర్‌రావు, మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, వైస్ చైర్మన్ ముఖేశ్‌గౌడ్, మాజీ చైర్మన్ వసుంధర, బీఆర్ ఎస్ నాయకులు నడిపెల్లి విజిత్‌రావు, అత్తి సరోజ, ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

శుభపరిణామం



ఆర్టీసీని సర్కారులో విలీనం చేస్తున్నట్లు సీఎం కేసీఆర్ తీసుకున్న నిర్ణయం హర్ష ణీయం. శాసనసభలో బిల్లు పెడతామని ప్రకటించడం ఉద్యోగుల్లో ఆనందం నింపుతోంది. ఆర్టీసీ లాభాల బాటపట్టడానికి అనేక సూచనలు చేయడం.. ఏకం గా ప్రభుత్వంలో విలీనం చేయాలని నిర్ణయించడం శుభపరిణామం.

– పీఎం రావు, ఆర్టీసీ డ్రైవర్

విలీన నిర్ణయం హర్షణీయం



ఆర్టీసీని సీఎం కేసీఆర్ బలో పేతం చేస్తున్నారు. సంస్థను ప్రభుత్వంలో విలీనం చేయా లని నిర్ణయించడం హర్ష ణీయం. పెండింగ్‌లో ఉన్న పేస్కేల్‌పై కూడా నిర్ణయం తీసుకుంటే కార్మికులకు ప్రయోజనం ఉంటుంది. సీసీఎస్ విషయంలో ఏళ్ల తరబడి పరిష్కారంకాక ఇబ్బందులు పడుతున్నాం. మిగతా సమస్యలన్నీ పరిష్కరించాలి.

– సత్తయ్య, ఆర్టీసీ ఉద్యోగి

జిల్లాలో తహసీల్దార్ల బదిలీలు

మంచిర్యాలఅగ్రికల్చర్: సాధారణ ఎన్నిక లు దగ్గర పడుతున్న నేపథ్యంలో జిల్లాలో అధికారుల బదిలీల ప్రక్రియ వేగంగా కొన సాగుతోంది. ఇప్పటికే అదనపు కలెక్టర్, స్పె షల్ డిప్యూటీ కలెక్టర్, రెవెన్యూ డివిజన్ అధి కారులను పదోన్నతిపై స్పెషల్ డిప్యూటీ క లెక్టర్లుగా, మున్సిపల్ కమిషనర్లను ఇతర జి ల్లాలకు బదిలీ చేసిన విషయం తెలిసిందే. మంగళవారం రాష్ట్ర రెవెన్యూ శాఖ కమిషన ర్ నవీన్ మిట్టల్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బ దిలీలు చేపట్టి ఉత్తర్వులు జారీ చేశారు. జి ల్లాలో పనిచేస్తున్న ఎస్.విజయానందం, సంపతి శ్రీనివాస్, ఏ దిలీప్‌కుమార్, పీ హ నుమంత్‌రావు, జే రాజలింగం, వీ మోహన్ రెడ్డి, బీ రవీందర్‌రావు, ఎం.జ్యోతి, ఎం.వ సంతి. జీ కుమార్‌స్వామి, ఎస్.భూమేశ్వర్, రాంచందర్, సురేశ్, డీ పుష్పలత, డీ కవిత, వేముల రాజ్‌కుమార్, ఎం.బాబు రాజేంద్ర ప్రసాద్‌వర్మ, విజయానందం, ఆర్.శేఖర్, ఈ కిషన్‌ను మల్టీజోన్‌లోని జిల్లాలకు బదిలీ చేశారు. ప్రస్తుతం పనిచేస్తున్న మంచిర్యాల జిల్లాతో పాటు, స్థానిక జిల్లాలకు కాకుండా ఇతర జిల్లాలైన కుమురంభీం ఆసిఫాబాద్, ఆదిలాబాద్, నిర్మల్, పెద్దపల్లి, జగిత్యాల, కరీంనగర్, నిజామాబాద్ జిల్లాలకు బదిలీ చేశారు. ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫా బాద్, నిర్మల్, పెద్దపల్లి జిల్లాల్లో పనిచేస్తు న్న, మంచిర్యాల జిల్లాలో స్థానికత లేని తహసీల్దార్లు కే చంద్రశేఖర్, ఎం.బోజన్న, టీ రవీంద్రరావు, కొరపల్లి వనజారెడ్డి, అల్మ సంధ్యారాణి, ఇమ్రాన్‌ఖాన్ పాఠన్, బీ మ హేంద్రనాథ్, పీ సతీశ్‌కుమార్, కే గంగాధ ర్, బిక్రమదాస్, బత్తుల విశ్వంభర్, షేక్ కరీం, ఆర్.వెంకటలక్ష్మి, కే రమేశ్, బీ సుధా కర్, కేవై ప్రసాద్, కే వేణుగోపాల్, బీ దత్తు ప్రసాద్‌రావును జిల్లాకు కేటాయించారు.

182మంది విద్యార్థుల సర్టిఫికెట్ల పరిశీలన

బెల్లంపల్లి: బెల్లంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల హెల్ప్‌లైన్ కేంద్రంలో మంగళవారం ఈసెట్ -2023లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు కౌన్సె లింగ్ నిర్వహించారు. విద్యార్థుల వివరాలను ఆన్ లైన్‌లో నమోదు చేశా రు. ధ్రువీకరణ పత్రాలు పరిశీలించారు. రెండోరోజు కౌన్సెలింగ్‌కు 182 మం ది హాజరైనట్లు ప్రిన్సిపాల్ రవీందర్‌రెడ్డి తెలిపారు.

సింగరేణి స్థలాలను రెవెన్యూకు అప్పగించాలి


- రామకృష్ణాపూర్, మందమర్రిలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలి
- సింగరేణి సీఎండీ శ్రీధర్‌ను కోరిన విప్ బాల్క సుమన్



సీఎండీతో మాట్లాడుతున్న విప్ సుమన్

రామకృష్ణాపూర్: జీవో 76లో భాగంగా రామకృష్ణా పూర్ పట్టణంలో గతంలో చేసిన సర్వేలో కొన్ని కార ణాలతో మిస్సయిన కాలనీలకు చెందిన సింగరేణి భూములను రెవెన్యూశాఖకు అప్పగించాలని ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్ సిం గరేణి సీఎండీ శ్రీధర్‌ను కోరారు. హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో మంగళవారం సీఎండీని సుమన్ కలిశారు. రామకృష్ణాపూర్ పట్టణంలో భూముల క్రమబద్ధీకరణలో భాగంగా ఇప్పటికే 3,035 మం దికి ఇండ్ల పట్టాలు ఇచ్చినట్లు తెలిపారు. ఆయా కార ణాలతో కొన్ని కాలనీలు భగత్‌సింగ్‌నగర్, రాజీవ్‌న గర్, శివాజీనగర్, జవహర్‌నగర్, శ్రీనివాస్‌నగర్, మల్లికార్జున్‌నగర్, గంగాకాలనీ, విద్యానగర్, ఆర్కే4 గడ్డ, పోస్టాఫీస్ ఏరియాలకు చెందిన సింగరేణి భూములు ఇంకా రెవెన్యూశాఖకు అప్పగించలేదని సీఎండీ దృష్టికి తీసుకువచ్చారు. అందరికీ పట్టాలి వ్వాలన్న ప్రభుత్వ సంకల్పాన్ని అర్థం చేసుకుంటూ ఆర్కేపీలో మిస్సయిన సింగరేణి స్థలాలను రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌కు అందించాలని కోరారు. మందమ ర్రి, రామకృష్ణాపూర్‌లోని సింగరేణి వార్డుల్లో సీసీ, బీటీ రోడ్లు నిర్మించడంతో పాటు డ్రైనేజీ నిర్మాణాలు చేపట్టాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. క్యాతనప ల్లి మున్సిపాలిటీలోని రెండోవార్డు జ్యోతినగర్‌లో నిర్మించనున్న కేసీఆర్ అర్బన్ పార్క్ కోసం 30 ఎక రాల సింగరేణి స్థలాన్ని అప్పగించాలని కోరారు.

ఆవిష్కరణలకు ఆహ్వానం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

నస్పూర్: ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమంలో పా ల్గొనే అభ్యర్థులకు ఆహ్వానం పలుకుతున్నట్లు కలెక్టర్ బదావత్ సంతోష్ తెలిపారు. మంగళవారం ఆయన నస్పూర్‌లోని సమీకృత కలెక్టరేట్ భవన సము దాయంలో డీపీఆర్వో వై.సంపత్‌కుమార్, ఈ డీ ఎం సునీల్, తహసీల్దార్ రాజేశ్వర్‌తో కలిసి ఇంటింటా ఇన్నోవేటర్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భం గా కలెక్టర్ మాట్లాడుతూ.. స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల సందర్భంగా రాష్ట్రంలోని 33 జిల్లాల్లో ఒకే సారి ఆవిష్కరణల ప్రదర్శన నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. గ్రామీణం, విద్యార్థులు, వ్యవసాయ రంగం, సూక్ష్మ చిన్నతరహా పరిశ్రమల ఆవిష్కర ణలు మాత్రమే అంగీకరించబడతాయని తెలిపారు. ఆవిష్కరణలకు సంబంధించి ఆరు వ్యాఖ్యలు, రెం డు నిమిషాల నిడివిగల వీడియో ఆవిష్కరణ, నాలుగు ఫొటోలు, ఆవిష్కర్త వివరాలతో ఈ నెల 5లోగా 9100678543 నంబర్‌కు వాట్సాప్ చేయా లని సూచించారు. ఐదు ఆవిష్కరణలను మాత్రమే ప్రదర్శనకు ఎంపిక చేయనున్నట్లు వివరించారు.

మొసళ్ల కేంద్రం సందర్శన




మొసళ్ల కేంద్రం వద్ద కలెక్టర్ సంతోష్, సివిల్ సర్వెంట్లు, అధికారులు

జైపూర్: శివ్వారం మొసళ్ల అభయారణ్యాన్ని సివిల్ సర్వెంట్లు, కలెక్టర్ బదావత్ సంతోష్ దంపతులు, డీ సీపీ సుధీర్ రాంనాథ్‌కైకన్, డీఎఫ్‌వో శివఆశిష్‌సింగ్, అడిషనల్ కలెక్టర్లు రాహుల్, గౌతమి మంగళవారం సందర్శించారు. గుట్టపై ఏర్పాటు చేసిన వాచ్‌టవర్ పైనుంచి ప్రకృతి అందాలు వీక్షించారు. వీరి వెంట స్థానిక తహసీల్దార్ మోహన్‌రెడ్డి, ఎంపీడీవో సత్యనా రాయణ, స్థానిక సర్పంచ్ గణేశ్ తదితరులున్నారు.

టమాటా @ 200

- రూ.100కు చేరిన వంకాయ
- వర్షాలతో రెట్టింపైన ధరలు
- కొనలేకపోతున్న సామాన్యులు



మంచిర్యాలఅగ్రికల్చర్: వంటకాల్లో టమాటాకు ఉన్న ప్రాధాన్యం అంతా ఇంతా కాదు. ఏ వంట చేయాలన్నా టమాటా, ఉల్లి తప్పనిసరి. ఇంతటి ప్రాధాన్యం ఉన్న వీటి ధరల పెరుగుదల సామాన్య మధ్య తరగతి ప్రజలపై తీవ్ర ప్రభావం చూపుతోం ది. మొన్నటివరకు కిలో టమాటా రూ.100 ఉండ గానే జనాలు కొనేందుకు తంటాలు పడ్డారు. ఇప్పుడు ఏకంగా రూ.200కు చేరగా ఇక కొనలేమం టూ వాపోతున్నారు. అలాగే కిలో ఉల్లి రూ.15 నుం చి రూ.20 ఉండగా ఇప్పుడు రూ.35 నుంచి రూ.40కి చేరింది. జూన్ నెలాఖరు వరకు వేసవి ప్రతాపం కొనసాగగా జిల్లాలో కూరగాయల సాగు తగ్గింది. దీంతో ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి దిగు మతి అయ్యాయి. 2019 వరకు జిల్లాలో 13,670 ఎక రాల్లో టమాటా, మిర్చి, ఇతర కూరగాయల పం టలు సాగు కాగా, ప్రస్తుతం 6,840 ఎకరాలు మాత్రమే సాగు చేస్తున్నారు. రెండేళ్లలో వానాకాలం లో కూరగాయల సాగు తగ్గింది. ప్రభుత్వం రాయి తీపై విత్తనాలు ఇవ్వక పోవడంతో రైతులు అధిక ధరలు చెల్లించి డీలర్ల వద్ద కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం అరకొరగా సాగవుతున్న కూరగాయల పం టలు ఇప్పుడిప్పుడే ఎదిగే దశలో ఉన్నాయి. ప్రధాన పంట టమాటా, మిర్చి ఇంకా అందుబాటులోకి రాలేదు. దీంతో ఇతర జిల్లాల నుంచి దిగుమతి అవు తున్నాయి. రాష్ట్రంలో జూలై 24 నుంచి వారంపాటు కురిసిన ఎడతెరిపి లేని భారీ వర్షాలతో పంటలు దెబ్బతిన్నాయి. రవాణా వ్యవస్థ కుదేలైంది. దీంతో ధరలు మరింత పెరిగాయి. కూరగాయలతో పాటు నిత్యావసరాల ధరలూ పెరిగి సామాన్యులు ఉక్కి రిబిక్కిరవుతున్నారు. పదిరోజుల క్రితం ఏ కూర గాయ కొన్నా కిలో రూ.60 నుంచి రూ.80కి లభించ గా ఇప్పుడు రూ.100 నుంచి రూ.200కు చేరింది.

ఆకాశాన్నంటిన ధరలు

వర్షాలు, వరదలతో జిల్లా ఆగమాగమవుతుంటే.. కూరగాయల ధరలు కుతకుతమంటున్నాయి. టమాటా, వంకాయ, ఉల్లితోపాటు మిగతా కూర గాయల ధరలు కూడా ఆకాశాన్నంటాయి. పచ్చిమిర్చి రూ.160, చిక్కుడు రూ.100, బీర రూ.100కు చేరాయి. భారీ వర్షాలు, వరదల కారణం గా దూరప్రాంతాల నుంచి రవాణా సౌకర్యానికి అం తరాయమేర్పడి దిగుమతి తగ్గింది. మహారాష్ట్ర, ఆం ధ్రప్రదేశ్‌లోనూ వర్షాలు, వరదలు ఉండగా సరుకు లు రావడం లేదంటూ వ్యాపారులు చెబుతున్నారు. ఉన్న సరుకును బ్లాక్ చేసి అధికధరలకు విక్రయిస్తు న్నారు. ఏ కూరగాయ కొనాలన్నా సామాన్యుడికి అందుబాటులో ఉండడం లేదు. రూ.500తో మార్కె ట్‌కు వెళ్తే వారానికి సరిపడా రావడం లేదు.


నిత్యావసరాల ధరలకూ రెక్కలు..

కూరగాయల ధరలతోపాటు నిత్యావసరాల ధర లకూ రెక్కలొచ్చాయి. రెక్కడితేగాని డొక్కాడని కూలీలు పొద్దంతా పని చేసి వచ్చిన కూలి డబ్బుల తో కుటుంబాన్ని పోషించుకోలేని దుస్థితి ఏర్పడిం ది. పైగా వర్షాల కారణంగా వారంరోజులుగా పను లు లేక ఇళ్లకే పరిమితమైన వీరి పరిస్థితి అగమ్యగోచ రంగా తయారైంది.

పెరిగిన ధరలు (కిలోకు..)

కూరగాయలు	ఈ నెల 20న	30న
టమాటా	రూ.100–120	రూ.180–200
పచ్చిమిర్చి	రూ.100	రూ.140–160
వంకాయ	రూ.60	రూ.80–100
బీర	రూ.70	రూ.100
చిక్కుడు	రూ.60	రూ.100
బెండ	రూ.40	రూ.80
గోరుచిక్కుడు	రూ.60	రూ.90
కాకర	రూ.60	రూ.80
అలసంద	రూ.60	రూ.80
మునగ	రూ.80	రూ.200
బోడకాకర	రూ.240	రూ.300
క్యారెట్	రూ.60	రూ.140
దొండ	రూ.50	రూ.80
గోబీ	రూ.60	రూ.80
సోర	రూ.30	రూ.50
ఉల్లి	రూ.20	రూ.40
ఆలు	రూ.25	రూ.30

కొనేందుకు భయపడుతున్నరు



పది రోజుల క్రితం టమాటా బాక్స్ రూ.3వేలకు వచ్చిం ది. నాలుగు రోజులుగా వర్షాలు పడడంతో రూ.4వే లకు చేరింది. కిలోకు రూ.180 నుంచి రూ.200వరకు అమ్మితేనే గిట్టు బాటవుతుంది. ధర చెప్పగానే భయపడుతున్నరు. ఎవరూ ముందుకువస్తలేరు.

– లలిత, బెల్లంపల్లి, కూరగాయల వ్యాపారి

కొనలేకపోతున్నం



కూరగాయల ధరలు అమాంతం పెరిగినయ్. వారంక్రితం కిలో టమా టా రూ.100 ఉండే. ఇప్పుడు రూ.200 అంటు న్నరు. రూ.100 ఉన్న పచ్చిమిర్చి రూ.160కి చేరింది. పావుకిలో టమాటా, మిర్చి కొనాల్సి వచ్చింది. గతంలో ఈ ధరలు ఎప్పుడూ లేవు.

– సుందరగిరి రమేశ్, బెల్లంపల్లి

గీ ధరలు ఎప్పుడూలేవు



కిలో టమాటా ధర రూ.200 అంటున్నరు. ఈ ధర ఇంతకుముందె ప్పుడూ లేదు. ఈ ధరలు చూస్తే ఏమీ కొనేటట్లు లేదు. వర్షాలతోనే కూరగాయల ధరలు పెరిగిన య్ అంటున్నరు. కిలోకు బదులు పావుకిలో, అరకిలో కొనుగోలు చేయాల్సి వస్తోంది.

– తోట శంకర్, నెన్నెల

ధరల భారం తగ్గించాలె



కూరగాయలు కొందామని మార్కెట్‌కు వెళ్తే టమాటా ధర చూసి నోటమాట రాలేదు. కూరల్లో టమాటా లేనిదే రుచి ఉండదు. కిలోకు బదులు పావుకిలో కొనుగోలు చేయాల్సి వచ్చింది. వరదల పేరుతో ధరలు పెంచిన్రు. ప్రభుత్వం ధరల భారం తగ్గించాలె.

– కొండు నరేశ్, శ్రీరాంపూర్

అమ్మపాలు.. అమృతం

- తల్లీబిడ్డలకు రక్ష
- ప్రారంభమైన తల్లిపాల వారోత్సవాలు
- వారం రోజులపాటు అవగాహన

జిల్లా వివరాలు	
అంగన్‌వాడీ కేంద్రాలు	969
బాలింతలు	3,902
గర్భిణులు	4,343
చిన్నారులు	31,144



తల్లిపాలపై అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు (ఫైల్)

మంచిర్యాలటౌన్‌: తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానం. అన్నిరకాల పోషకాలు తల్లిపాలలో ఉన్నాయి. రోగాల బారినుంచి బిడ్డను రక్షిస్తాయి. పోతపాల కంటే తల్లిపాలు తాగిన పిల్లలు బలంగా, తెలివిగా ఉంటారన్నది నిరూపితమైన వాస్తవం. శిశువు సంపూర్ణ ఆరోగ్యంతో, వజ్ర సమానమైన రోగ నిరోధక శక్తిని పొందాలంటే తల్లిపాలు పట్టించాల్సిందే. ఇంతటి విశిష్టత కలిగిన తల్లిపాల ప్రాముఖ్యతను చాటేందుకు ఐసీడీఎస్‌ ఆధ్వర్యంలో ఈ నెల 1 నుంచి7 వరకు వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించనున్నారు.

వ్యాధులు దరిచేరవు

అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ఆరునెలల వరకు తల్లిపాలు తప్ప మరేం పట్టకూడదు. తల్లి పాలు తేలికగా అరుగుతాయి. అంతే కాకుండా శుభ్రంగా ఉంటాయి. శ్వాసకోశ, అలర్జీ, అస్తమా, చర్మవ్యాధుల నుంచి పిల్లలను రక్షిస్తాయి. బిడ్డ మానసిక, శారీరక వికాసానికి అవసరమైన పోషకాలను అందిస్తాయి. రోజులో 8 నుంచి 10 సార్లు బిడ్డకు తల్లిపాలు ఇవ్వాలి. ఆరు మాసాల తర్వాత నుంచి బిడ్డకు తల్లిపాలతో పాటు అనుబంధ ఆహారం ఇవ్వాలి. రెండేళ్ల వరకు క్రమం తప్పకుండా పాలు పట్టాలి. దీనివల్ల ఎలాంటి వ్యాధులు దరిచేరకుండా బిడ్డ ఎదుగుదల సక్రమంగా ఉంటుంది.

ముర్రుపాలు తప్పనిసరి

బిడ్డ పుట్టిన మొదటి అరగంటలోపు తల్లులకు వచ్చే పాలను ముర్రుపాలు అంటారు. ఇవి కచ్చితంగా శిశువుకు పట్టించాలి. దీనివల్ల రోగనిరోధక శక్తి పెరగడమే కాకుండా బిడ్డకు సమతుల్యమైన పోషకాహార పదార్థాలు అందుతాయి. ఇందులో మాంసకృత్తులు, విటమిన్‌ 'ఏ' ఉంటుంది. వ్యాధులు దరిచేరకుండా కాపాడుతాయి. శిశువు పేగులను శుభ్రం చేసి మొదటి మల విసర్జనకు తోడ్పడుతాయి. తల్లులు సహజంగా బిడ్డకు సరిపడా పాలు రావడం లేదని అనుకోవడం అపోహ మాత్రమే. బిడ్డ పుట్టిన మూడు, నాలుగు రోజుల వరకు పాలు పడవని తేనె నాకించడం, పంచదార నీళ్లు ఇవ్వడం, గ్లూకోజ్‌ నీళ్లు ఇవ్వడం చేయకూడదు.

పాలు పుష్కలంగా రావాలంటే...

గర్భం దాల్చినప్పటి నుంచే పోషక విలువలున్న ఆహారం తీసుకోవాలి. పాలు, చేపలు, గుడ్లు, వెల్లుల్లిపాయ, తాజా కూరగాయలు, పండ్లు తగిన మోతాదులో తీసుకోవాలి. ఆహారంలో తీపి పదార్థాలు (స్వీటు కాదు) అంటే ప్రకృతిలో సహజంగా దొరికే పండ్లు శుభ్రంగా కడిగిన తర్వాత తినాలి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

బిడ్డకు పాలిచ్చే సమయంలో తల్లి కొన్నింటిపై ప్రత్యేకంగా శ్రద్ధ చూపాలి. బిడ్డను పడుకోబెట్టి, నిలబెట్టి పాలు పట్టకూడదు. ఇలా ఇవ్వడం చాలా ప్రమాదకరం, పాలిచ్చే సమయంలో కెఫిన్‌ అధికంగా ఉండే పదార్థాలు, శీతల పానీయాలు తీసుకోక పోవడం మంచిది. ఇది బిడ్డ శారీరక, మానసిక ఎదుగుదలపై ప్రభావం చూపుతుంది.

తల్లిపాలు శ్రేష్ఠమైనవి



తల్లిపాలు శ్రేష్ఠమైనవి. గర్భిణులు, బాలింతలు తల్లిపాల విశిష్టతను తప్పకుండా తెలుసుకోవాలి. పుట్టిన బిడ్డకు తల్లిపాలు ఇవ్వడం వల్ల పిల్లల్లో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. పిల్ల లు ఆరోగ్యంగా ఉంటారు. వీటిపై అవగాహన కల్పించేందుకు ఏటా ఆగస్టు మొదటివారంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్నాం.

– చిన్నయ్య, జిల్లా సంక్షేమశాఖ అధికారి

తల్లిపాలతో బిడ్డకు కలిగే లాభాలు

- సంపూర్ణమైన సంతులిత ఆహారాన్ని అందిస్తాయి.
- బిడ్డకు అవసరమయ్యే విటమిన్లు పుష్కలంగా ఉంటాయి.
- బిడ్డను రక్తహీనత నుంచి కాపాడుతాయి.
- తొలి నెలలో అంటు వ్యాధుల బారినుంచి కాపాడుతాయి.
- బిడ్డ మనోవికాసానికి తోడ్పడుతాయి.
- బిడ్డ మృదువైన మల విసర్జనకు, మల బద్ధకం సమస్య నివారణకు తోడ్పడుతాయి. జీర్ణ మండలాన్ని వృద్ధి చేస్తాయి.
- డయేరియా, నిమోనియా వంటి ప్రాణాంతక వ్యాధుల నుండి కాపాడుతాయి. క్యాన్సర్‌, చెవికి సంబంధించిన వ్యాధులు, గుండె జబ్బుల బారినుంచి రక్షణ కల్పిస్తాయి.
- ఎలర్జీ, అస్తమా, డయాబెటీస్‌ వంటి వ్యాధులు దరిచేరవు.
- బాల్యం, యవ్వనంలో ఊబకాయం వచ్చే ప్రమాదం తక్కువ.

తల్లికి కలిగే లాభాలు..

- తల్లులు చనుబాలు ఇవ్వడం వల్ల జీవితాంతం ఆరోగ్యంగా ఉంటారు.
- ఊబకాయం వచ్చే ప్రమాదం తగ్గుతుంది. గర్భానికి పూర్వం ఉన్న బరువును తిరిగి పొందుతారు.
- రొమ్ము, గర్భసంచి క్యాన్సర్లు రావు.
- మలి వయసులో వచ్చే అస్టియో పొరొసిస్‌ (ఎముకల బలహీనత) నుంచి కాపాడుతుంది.
- తల్లీ శిశువుల మధ్య బంధాన్ని పెంపొందిస్తుంది.

క్లుప్తంగా

జనవాసాల్లోకి మొసలి


బాదంపల్లిలో కనిపించిన మొసలి

జన్నారం: మండలంలోని బాదంపల్లి గ్రామ శివారులో మంగళవారం జనావాసాల్లో మొసలి కనిపించింది. భయాందోళన చెందిన గ్రామస్తులు ఇళ్లకు పరుగులు తీసారు. అటవీశాఖ అధికారులకు సమాచారం అందించడంతో రేంజ్‌ అధికారి హఫీజొద్దీన్‌ బీట్‌ అధికారి సతీశ్‌ను గ్రామానికి పంపించారు. గ్రామస్తుల సహాయంతో మొసలిని పట్టి తిరిగి గోదావరిలో వదిలేయడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్య


బాయక్క (ఫైల్)

బెజ్జూర్‌(సిర్పూర్‌): పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై విక్రమ్‌ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని గోల్కొండ వీధికి చెందిన బుర్సు బాయక్క (57) భర్త ఎర్రయ్య నిత్యం మద్యం సేవించి ఇంటికి వచ్చి వేధింపులకు గురిచేసేవాడు. దీంతో జీవితంపై విరక్తి చెందిన మహిళ మంగళవారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి సోదరుడు ఆత్రం బక్కయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు


ఆస్పత్రిలో క్షతగాత్రులు

బెజ్జూర్‌: రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలపాలైన సంఘటన మంగళవారం మండలంలో చోటు చేసుకుంది. చింతలమానేపల్లికి చెందిన తొంబ్రే మనోహర్‌, జూనగారి లక్ష్మి ద్విచక్ర వాహనంపై పాపన్నపేట్‌కు వెళ్తుండగా కుకుడ గ్రామానికి చెందిన సద్మేమేక రఘుపతి, అంబగట్టు గ్రామానికి చెందిన వెంకటేశ్‌ బైక్‌పై వెనుక నుంచి వచ్చి ఢీకొట్టడంతో మనోహర్‌, లక్ష్మి, రఘుపతికి గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించడంతో క్షతగాత్రులను బెజ్జూర్‌ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

విరిగిన ఎలక్ట్రిక్‌ బైక్‌


విరిగిపోయిన ఎలక్ట్రిక్‌ బైక్‌

మంచిర్యాలక్రైం: మొన్నటి వరకు ఎలక్ట్రిక్‌ బైక్‌లు షార్ట్‌ సర్క్యూట్‌తో దగ్ధమైన ఘటనలు చూసి వామ్మో అనుకున్నాం. కానీ ప్రస్తుతం తాజాగా మరో కొత్త సంఘటన వెలుగు చూసింది. శ్రీరాంపూర్‌కు చెందిన శ్రావణ్‌ ఏడాది క్రితం రూ.65 వేలతో ఆటామ్‌1.0 ఎలక్ట్రిక్‌ బైక్‌ కొనుగోలు చేసాడు. మంగళవారం సాయంత్రం బైక్‌ మీద మంచిర్యాలకు వస్తుండగా వెంకటేశ్వర థియేటర్‌ సమీపంలోకి రాగానే ఒక్కసారిగా షాకబ్జల్‌, ఫారక్‌ విరగడంతో కింద పడిపోయాడు. బైక్‌ వేగం తక్కువగా ఉండడంతో ప్రాణనష్టం జరుగలేదు. శ్రావణ్‌కు స్వల్పగాయాలయ్యాయి. బైక్‌ విరిగిన తీరును చూసి స్థానికులు అవాక్కయ్యారు.

ఉద్యమకారుడి హఠాన్మరణం

- గుండెపోటుతో ఏటీడబ్ల్యూఏసీ ఛైర్మన్‌ లక్కేరావు మృతి
- అంత్యక్రియలకు హాజరైన ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, ఐటీడీఏ పీవో


నివాళులర్పిస్తున్న ఆదిలాబాద్‌ కలెక్టర్‌ రాహుల్‌రాజ్‌, ప్రజాప్రతినిధులు

ఇంద్రవెల్లి: తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్‌ఎస్‌ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఏటీడబ్ల్యూఏసీ ఛైర్మన్‌ కనక లక్కేరావు(59) మంగళవారం గుండెపోటుతో హఠాన్మరణం పొందారు. తెలంగాణ ఉద్యమంలో ఉపాధ్యాయ జేఏసీ కన్వీనర్‌గా ఈయన చురుకైన పాత్ర పోషించారు. 2006లో ఉపాధ్యాయ ఉద్యోగానికి రాజీనామా చేశారు. అనంతరం ఆదివాసీ రాయిసెంటర్‌ సలహాదారుడిగా కొనసాగుతూనే ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించారు. బీఆర్‌ఎస్‌లో జిల్లా, రాష్ట్రస్థాయిలో వివిధ హోదాల్లో పనిచేశారు. ఈయన సేవలను గుర్తించిన పార్టీ అధిష్టానం 2016లో ఏటీడబ్ల్యూఏసీ ఛైర్మన్‌గా బాధ్యతలు అప్పగించింది. 2018 వరకు ఈ పదవిలో కొనసాగారు. ఏజెన్సీ మండలాల్లోని గ్రామాల అభివృద్ధికి ప్రత్యేకంగా కృషి చేశారు. ఈ క్రమంలో రెండోసారి 2021లో ఏటీడబ్ల్యూఏసీ ఛైర్మన్‌గా బాధ్యతలు అప్పగించగా ఇప్పటి వరకు కొనసాగుతూ వచ్చారు. ఈయనకు భార్య అనుసూయబాయి, కుమారులు వెంకటరమణ, కళ్యాణ్‌ ఉన్నారు.

తుమ్మగూడలో విషాదఛాయలు

లక్కేరావు మృతితో ఆయన స్వగ్రామమైన ఇంద్రవెల్లి మండలం తుమ్మగూడలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఉమ్మడి జిల్లాకు చెందిన ప్రముఖులతో పాటు ఆదివాసీ గిరిజన నేతలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, గిరిజనులు భారీగా తరలివచ్చారు. మృతదేహంపై పుష్పగుచ్ఛాలు ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. ఆదిలాబాద్‌ ఎమ్మెల్యే జోగు రామన్న, ఆసిఫాబాద్‌ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, ఆదిలాబాద్‌ జెడ్పీ ఛైర్మన్‌ జనార్దన్‌ రాథోడ్‌, మాజీ ఎంపీ గోడం నగేశ్‌, మహిళా కమిషన్‌ సభ్యురాలు ఈశ్వరిబాయి, ఆదిలాబాద్‌ కలెక్టర్‌ రాహుల్‌రాజ్‌, నిర్మల్‌ కలెక్టర్‌ వరుణ్‌రెడ్డి, ఐటీడీఏ పీవో చాహత్‌బాజ్‌పాయ్‌ గ్రామానికి చేరుకుని మృతదేహం వద్ద నివాళులర్పించారు. సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించారు.

ఒంటిపై పెట్రోల్‌ పోసుకుని యువకుడి బలవన్మరణం


రమాకాంత్‌ (ఫైల్‌)

బెల్లంపల్లి: మద్యానికి బానిసైన యువకుడు ఒంటిపై పెట్రోల్‌ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం పట్టణంలో చోటు చేసుకుంది. ఎస్సై ప్రవీణ్‌కుమార్‌ తెలిపిన వివరాల ప్రకారం కరీంనగర్‌ జిల్లా టేకుమట్ల మండలం ఎంపేడ్‌ గ్రామానికి చెందిన ముత్యాల రమాకాంత్‌ (30) ఐదేళ్ల క్రితం బెల్లంపల్లిలోని హన్మాన్‌ బస్తీకి చెందిన చెన్న రవళిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. నాలుగేళ్ల క్రితం బెల్లంపల్లికి వచ్చి బార్బర్‌ షాపులో కుల వృత్తి చేసుకుంటున్నాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసయ్యాడు. మద్యం మత్తులో పలుమార్లు ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డాడు. మంగళవారం ఉదయం ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన యువకుడు మద్యం సేవించి పెట్రోల్‌ డబ్బాతో వచ్చాడు. పక్కవీధికి వెళ్లి అందరూ చూస్తుండగానే ఒంటిపై పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై ప్రవీణ్‌కుమార్‌ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతునికి భార్య, కూతురు ఉన్నారు. మృతుని సోదరుడు ముత్యాల దేవేందర్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

బీసీలు ఐకమత్యంతో ముందుకెళ్లాలి


మాట్లాడుతున్న బీసీ సంఘాల నాయకులు

జన్నారం: రాబోయే ఎన్నికల్లో బీసీలంతా ఐకమత్యంతో రాజ్యాధికారం దిశగా ముందుకెళ్లాలని బీసీ కులాల ఉద్యమ పోరాట సమితి ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్‌ కొడూరి చంద్రయ్య అన్నారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో బీసీ జనాభా అధికంగా ఉన్నా చట్టసభల్లో మాత్రం అంతగా కనిపించడం లేదన్నారు. బీసీలంతా ఏకమై 35 మంది ఎమ్మెల్యేలను గెలిపించుకుంటే తెలంగాణలో రాజ్యాధికారం సాధించుకోవచ్చన్నారు. పార్టీలకు అతీతంగా బీసీలు ఏకం కావాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. సమావేశంలో బీసీ కులాల ఉద్యమ పోరాట సమితి నాయకులు నర్సింహులు, కడార్ల నర్సయ్య, కాసెట్టి లక్ష్మణ్‌, లక్ష్మీనారాయణ, భాస్కర్‌గౌడ్‌, గంగయ్య, గంగాధర్‌, రవి, రాజన్న, సత్తయ్య, వినయ్‌, తదితరులు పాల్గొన్నారు.

మందమర్రి ఏరియా పరిరక్షణకు ఉద్యమిస్తాం

రామకృష్ణాపూర్‌(చెన్నూర్‌): మందమర్రి ఏరియా పరిరక్షణ కోసం ఉద్యమిస్తామని ఐఎన్టీయూసీ కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడు సిద్దంశెట్టి రాజమౌళి అన్నారు. పట్టణంలోని యూనియన్‌ కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ఏరియా పరిధిలోని ఆర్‌కే1ఏ గనిని ఇంకా కొనసాగించేందుకు సరిపడా బొగ్గు నిల్వలు ఉన్నప్పటికీ అకారణంగా మూసివేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేకే–6 గనికి ఇప్పటికే భూమిపూజ చేసినప్పటికీ ఆ గనిని తెరిచేందుకు ఎలాంటి ప్రయత్నాలు లేవన్నారు. గనుల మూతతో మందమర్రి, ఆర్‌కేపీ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతున్నా స్థానిక ఎమ్మెల్యే, ఎంపీలు నోరు మెదపడం లేదన్నారు. టీబీజీకేఎస్‌, ఏఐటీయూసీలు సైతం యాజమాన్యానికి వత్తాసు పలుకుతూ కార్మికవర్గాన్ని మోసం చేస్తున్నాయన్నారు. యూనియన్‌ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి కాంపెల్లి సమ్మయ్య, డివిజన్‌ ఉపాధ్యక్షుడు తేజావత్‌ రాంబాబు, శేఖర్‌, కొమురయ్య పాల్గొన్నారు.

శుద్ధజలం సరఫరాకు చర్యలు



మాట్లాడుతున్న జీఎం సంజీవరెడ్డి

నస్పూర్‌: కార్మిక కాలనీలకు స్వచ్ఛమైన తాగు నీరు సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టామని ఏరియా జీఎం సంజీవ రెడ్డి తెలిపారు. మంగళవారం జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శుద్ధజలం సరఫరాకు రూ.16.20 కోట్లతో ర్యాపిడ్‌ గ్రావిటి ఫిల్టర్‌ విధానాన్ని అమలు చేయడానికి చర్యలు చేపట్టామన్నారు. స్వచ్ఛత పక్వాడాలో భాగంగా సింగరేణి వ్యాప్తంగా శ్రీరాంపూర్‌ ఏరియాకు మొదటి బహుమతి వచ్చిందన్నారు. ఏరియాలోని ఆర్‌కే 8 డిస్పెన్సరీలో రూ.1,60,000లతో నూతన హెచ్‌బీఏ 1సి అనలైజర్‌ను ప్రారంభించామన్నారు.

కార్పొరేటర్లు, కౌన్సిలర్ల సమస్యలపై అసెంబ్లీలో చర్చించాలి

బెల్లంపల్లి: మున్సిపల్‌ కార్పొరేటర్లు, కౌన్సిలర్ల సమస్యలపై అసెంబ్లీ సమావేశాల్లో చర్చించాలని తెలంగాణ మున్సిపల్‌ కౌన్సిల్‌ ఫోరం రాష్ట్ర చైర్మన్‌ భూక్య రామునాయక్‌ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వార్డుల అభివృద్ధికి ఏడాదికి రూ.50 లక్షలు మంజూరు చేయాలని, ఎస్సీ సబ్‌ప్లాన్‌ నిధులు విడుదల చేయాలని, మహిళా కౌన్సిల్‌ సభ్యులు వార్డులో పర్యవేక్షించేందుకు స్కూటీ సమకూర్చాలని, మేయర్‌, చైర్మన్లకు రూ.లక్ష గౌరవ వేతనం చెల్లించాలని, సభ్యులకు రూ.10 వేల పెన్షన్‌ మంజూరు చేయాలని, తదితర డిమాండ్లను అసెంబ్లీలో చర్చించి ఆమోదించాలని కోరారు.

గ్రూప్‌-3 అభ్యర్థులకు ఉచిత శిక్షణ

మంచిర్యాలటౌన్‌: తెలంగాణ రాష్ట్ర మైనారిటీస్‌ స్టడీ సర్కిల్‌, మైనారిటీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో గ్రూప్‌–3 అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమశాఖ అధికారి రాజేశ్వరి ఓ ప్రకటనలో తెలిపారు. 60రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తులను జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ కార్యాలయం మంచిర్యాలలో/హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర మైనారిటీస్‌ స్టడీ సర్కిల్‌ కేరీర్‌ కౌన్సిలింగ్‌ సెంటర్‌లో, coachingforminoriti es.hyd @gmail.com కు ఈ నెల 13వ తేదీ సాయంత్రం 5గంటల్లోపు పంపాలని తెలిపారు. పూర్తి వివరాలకు 08736–259911 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. తొలుత దరఖాస్తు చేసుకున్న వారికి ప్రాధాన్యత ఉంటుందని వివరించారు.

దరఖాస్తుల ఆహ్వానం

మంచిర్యాలటౌన్‌: యూపీఎస్‌సీ సివిల్‌ సర్వీసెస్‌ 2024 పరీక్ష కోసం మైనార్టీ సంక్షేమశాఖ సంయుక్త ఆధ్వర్యంలో అందించే ఉచిత శిక్షణకు జిల్లాలోని మైనార్టీలు (ముస్లింలు, క్రిస్టియన్లు, సిఖ్‌, జైన్‌, బుద్దిస్ట్‌, పార్శి) దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి నీరటి రాజేశ్వరి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాల్లోని సాధారణ/ప్రొఫెషనల్‌ డిగ్రీ పూర్తి చేసిన మైనార్టీలు www. cet. cgg. gov. in/ tmreis ఆన్‌లైన్‌లో వెబ్‌సైట్‌ ద్వారా ఈ నెల 13లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. 28న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జిల్లా కేంద్రంలోని మైనార్టీ గురుకుల బాలికల పాఠశాలలో స్క్రీనింగ్‌ టెస్టు నిర్వహించడం జరుగుతుందన్నారు.

మందమర్రి ఏరియాలో 75 శాతం బొగ్గు ఉత్పత్తి


వివరాలు వెల్లడిస్తున్న జీఎం మోహన్‌రెడ్డి

మందమర్రిరూరల్‌: మందమర్రి ఏరియాలో గత మాసం 75 శాతం బొగ్గు ఉత్పత్తి జరిగిందని ఏరియా జీఎం మోహన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం జీఎం ఆఫీస్‌ ఆవరణలోని కాన్ఫరెన్స్‌హాలులో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏరియాలో ఓవరాల్‌గా 3,30,500 టన్నుల ఉత్పత్తి లక్ష్యానికి గానూ 2,47,642 టన్నుల ఉత్పత్తి సాధించినట్లు తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాలతో కేకే ఓసీలో 39 షిఫ్టులు, ఆర్కే ఓసీలో 45 షిఫ్టుల బొగ్గు ఉత్పత్తికి ఆటంకం కలిగిందన్నారు. ఆర్కే ఓసీ గనిలో మాత్రం 119 శాతం బొగ్గు ఉత్పత్తి జరిగిందన్నారు. ఉద్యోగులు సంస్థ అభివృద్ధికి సహకరిస్తే సంస్థ సంక్షేమ ఫలాలు కార్మిక కుటుంబాలకు అందుతాయన్నారు. సమావేశంలో ఏరియా పీఎం శ్యాంసుందర్‌, ఐఈడీ రాజన్న, సీనియర్‌ పీవో మైత్రేయబంధు పాల్గొన్నారు.

సెలవులు ఇవ్వాలని వినతి


ప్రిన్సిపాల్‌ గది ముందు విద్యార్థులు

లక్సెట్టిపేట: పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలో 'కళ్ల కలక'తో బాధపడుతున్న పలువురు విద్యార్థులు తమకు సెలవులు ఇవ్వాలని మంగళవారం ప్రిన్సిపాల్‌ లలితకు విన్నవించారు. ఇబ్బందిగా ఉందని వాపోయారు. స్పందించిన ప్రిన్సిపాల్‌ మీ తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వండి.. వారు వస్తే పంపిస్తానని చెప్పారు.

ఇద్దరు ఎఫ్‌ఆర్‌వోల బదిలీ..!


(BY ORDER AND IN THE NAME OF THE GOVERNOR OF TELANGANA)
CHIEF SECRETARY TO GOVERNMENT &
SPECIAL CHIEF SECRETARY TO GOVERNMENT (FOREST)
To
The Principal Chief Conservator of Forests (HoFF),
Telangana, Hyderabad

సోషల్‌ మీడియాలో వైరల్‌గా మారిన జీవో కాపీ

మంచిర్యాలక్రైం: జిల్లాలోని అటవీశాఖలో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు ఫారెస్ట్‌ రేంజ్‌ ఆఫీసర్లను బదిలీ చేస్తూ అటవీశాఖ ప్రత్యేక కార్యదర్శి శాంతికుమారి గతనెల 31న ఉత్తర్వులు జారీ చేశారు. ఇందుకు సంబంధించిన జీవో ఉత్తర్వుల కాపీ మంగళవారం సోషల్‌ మీడియాలో వైరల్‌గా మారింది. మంచిర్యాలలో ఎఫ్‌ఆర్‌వోగా పనిచేసిన ఎస్‌.రమేశ్‌ను ప్రిన్సిపల్‌ చీఫ్‌ కన్జర్వేటర్‌గా హైదరాబాద్‌కు, తాళ్లపేట ఎఫ్‌ఆర్‌వోగా పనిచేసిన జీ.రత్నాకర్‌రావ్‌ను మంచిర్యాల ఎఫ్‌ఆర్‌ఓగా బదిలీ చేస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ విషయమై జిల్లా ఉన్నతాధికారులను వివరణ కోరగా అధికారికంగా మాకు ఎలాంటి సమాచారం లేదన్నారు. బదిలీ ఉత్తర్వులు వెలువడి 24 గంటలు గడిచినా జిల్లాలోని ఉన్నతాధికారులకు అధికారికంగా ఎలాంటి సమాచారం లేకపోవడం గమనార్హం. సమాచారం కోసం సంబంధిత అధికారులను ఫోన్‌ చేయగా స్పందించలేదు.

'దళితుల భూమి లాక్కోవడం సరికాదు'


మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్‌ నాయకులు

చెన్నూర్‌: చెన్నూర్‌లో ఆర్టీసీ డిపో నిర్మాణం పేరుతో దళితుల భూమి లాక్కోవడం సరికాదని ఎమ్మార్పీఎస్‌ జిల్లా అధ్యక్షుడు సుందిల్ల మహేష్‌ అన్నారు. మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ డిపో పేరుతో తహసీల్దార్‌ శ్రీనివాస్‌దేశ్‌పాండే దళితుల మధ్య చిచ్చుపెడుతున్నారన్నారు. 50 ఏళ్ల క్రితం బోగె మల్లయ్యకు ప్రభుత్వం ఇచ్చిన మూడెకరాల భూమిని అతని మరణానంతరం వారసులు బోగె మల్లేశ్వరి, పెద్ద రాజేశ్వరి, చిన్న రాజేశ్వరి సాగు చేసుకుంటున్నారన్నారు. ఆ భూమికి బదులుగా పక్కనే ఉన్న మాదిగ సామాజిక వర్గానికి చెందిన తగరం చాందయ్య భూమిని ఇస్తామని తహసీల్దార్‌ చెప్పాడం ఏమిటని ప్రశ్నించారు. డిపో కోసం ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాల్సిన అధికారులు దళిత భూములను లాక్కోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి డిపో నిర్మాణాన్ని నిలిపి వేసి దళితుల భూమిని దళితులకు ఇవ్వాలని డిమాండ్‌ చేశారు. సమావేశంలో కాంగ్రెస్‌ నాయకులు దాసరపు శ్రీనివాస్‌, ఎమ్మార్పీఎస్‌ నాయకులు మంత్రి మల్లేశ్‌, రాసపాక మల్లేశ్‌, చిరంజీవి పాల్గొన్నారు.

శ్రీకాంత్‌రెడ్డికి మల్టీపుల్‌ మెరిట్‌ అవార్డు


అవార్డు అందుకుంటున్న శ్రీకాంత్‌రెడ్డి

జన్నారం: లయన్స్‌క్లబ్‌ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ వేస్ట్‌ స్పెషల్‌ డ్రైవ్‌ కార్యక్రమంలో కోఆర్డినేటర్‌గా వ్యవహరించిన జన్నారం మండల వాసి ఏనుగు శ్రీకాంత్‌రెడ్డికి మల్టీపుల్‌ మెరిట్‌ అవార్డు లభించింది. రాష్ట్ర వ్యాప్తంగా 7 లయన్స్‌ జిల్లాలకు ఈ వేస్ట్‌ కోఆర్డినేటర్‌ వ్యవహరించిన శ్రీకాంత్‌రెడ్డి ప్లాస్టిక్‌ వేస్ట్‌ పరికరాలను పోగుచేస్తూ కాలుష్య నివారణకు కృషి చేసినందుకు హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో మల్టిపుల్‌ కౌన్సిల్‌ చైర్మన్‌ విద్యాసాగర్‌ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.

చంద్రమోహన్‌కు ఇంటర్నేషనల్‌ ప్రెసిడెంట్‌ అవార్డు


మెడల్‌ అందుకుంటున్న చంద్రమోహన్‌గౌడ్‌

మంచిర్యాలటౌన్‌: పట్టణానికి చెందిన లయన్స్‌ క్లబ్‌ ఇంటర్నేషనల్‌ రీజియన్‌ ఛైర్‌పర్సన్‌ డాక్టర్‌ చంద్రమోహన్‌గౌడ్‌ మంగళవారం హైదరాబాద్‌లో ప్రతిష్టాత్మకమైన ఇంటర్నేషనల్‌ ప్రెసిడెంట్‌ మెడల్‌ అందుకున్నారు. 2022–23లో లయన్స్‌ క్లబ్‌ ఆధ్వర్యంలో అందించిన సేవలకుగానూ ఈ అవార్డును అందుకున్నట్లు ఆయన తెలిపారు. ఇందుకు సహకరించిన లయన్స్‌ క్లబ్‌ డిస్ట్రిక్ట్‌ గవర్నర్‌ రెక్కల నారాయణరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.